క్లుప్తంగా

వంతెన నిర్మించాలని వినతి



రీసర్వే టీడీ శ్రావణికి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కిర్లంపూడి: మండలంలోని శృంగరాయునిపాలెం, ఎస్.తిమ్మాపురం, కృష్ణవరం బెడ్ రెగ్యులేటర్ వద్ద వంతెన నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు రీసర్వే తహసీల్దార్ ఆర్.శ్రావణికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శృంగరాయునిపాలెం, ఎస్.తిమ్మాపురం గ్రామాల నుంచి నియోజకవర్గ కేంద్రానికి, అత్యవసర పరిస్థితుల్లో పట్టణాలకు వెళ్లాలంటే సుమారు 14 కిలోమీటర్ల మేర తిరిగి వెళ్లవలసి వస్తోందన్నారు. శృంగరాయునిపాలెం-కృష్ణవరం ఏలేరు కాలువ మధ్యలో ఉన్న రెగ్యులేటర్ వంతెన వద్ద బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఇక్కడ వంతెన నిర్మిస్తే కేవలం కిలో మీటర్ దూరంలోనే జాతీయ రహదారిని చేరుకోవచ్చన్నారు. వంతెన నిర్మాణంతో శృంగరాయునిపాలెం, ఎస్.తిమ్మాపురంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

'కరకాని' కుటుంబాన్ని ఆదుకోవాలి



ఏలేశ్వరంలో సత్యనారాయణకు బియ్యం, నగదు అందజేస్తున్న వీరాంజనేయులు

ఏలేశ్వరం: క్వారీ కార్మిక సంఘ నాయకుడు కరకాని సత్యనారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు కోరారు. పట్టణంలో శుక్రవారం సత్యనారాయణను పరామర్శించి 100 కేజీల బియ్యం, రూ.5 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ కార్మిక సంఘ నాయకుడిగా సత్యనారాయణ గత 30 ఏళ్లుగా కార్మికుల హక్కుల కోసం పోరాటం చేశారన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్వారీ, క్రషర్ యజమానులు స్పందించి సత్యనారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, కుంచే అంజిబాబు, కె.సతీష్, సుబ్బారావు, వెంకటేషులు పాల్గొన్నారు.

తాళ్లూరు పంచాయతీకి ట్రాక్టర్ మంజూరు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు పంచాయతీకి నూతన ట్రాక్టర్ మంజూరైనట్టు అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు అందిస్తున్న స్వచ్ఛ భారత్ నిధులతో ఈ ట్రాక్టర్ మంజూరైనట్టు పేర్కొన్నారు. నూతన ట్రాక్టర్‌ను స్థానిక జీయ్యన్న స్వామి ఆలయం వద్ద మాజీ వైస్ ఎంపీపీ పోతుల మోహన్‌రావు, గ్రామ సర్పంచ్ శీలామంతుల వీరబాబు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పాలచర్ల సత్యనారాయణ, పైన్ని వెంకటేశ్వరరావు, దేవస్థానం చైర్మన్ దాపర్తి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

గండేపల్లి: విద్యార్థులు ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు సూచించారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో స్పైడ్స్-2కె25 పేరిట జరుగుతున్న సాంకేతిక కార్యక్రమానికి మూడో రోజు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక సదస్సులో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు సమన్వయ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ వ్యక్తులతో ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది

గోకవరం: స్కూటీపై అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని గోకవరం పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తమకు అందిన సమాచారం మేరకు గోకవరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బమ్మెర పోతన విగ్రహం వద్ద గంగవరం మండలం కొత్తాడకు చెందిన పొడుగు జయరాజు, నెల్లపూడికి చెందిన కొంజర్ల ఈశ్వర వరప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.31 వేల విలువ గల 6.250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న స్కూటీని, రెండు సెల్‌ఫోన్‌లు, రూ.200 నగదు సీజ్ చేశారు. వీరిపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టుకు తరలించినట్టు ఎస్సై తెలిపారు.



ఉత్తరకంచిలో విశేష అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి



ఏలేశ్వరంలో సత్యనారాయణస్వామి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు



రత్నగిరిపై సత్యదేవుని రథ సేవలో మహిళల కోలాట ప్రదర్శన



చిల్లంగిలో వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుంటున్న ముద్రగడ గిరిబాబు దంపతులు



టి.తిమ్మాపురంలో స్వామివారిని దర్శించుకుంటున్న యనమల కృష్ణుడు, వైఎస్సార్ సీపీ నాయకులు

చూసిన కనులకు వైకుంఠం

- కన్నులపండువగా ముక్కోటి ఏకాదశి వేడుకలు
- ఉత్తర ద్వార దర్శనాలకు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయాలు

ఏలేశ్వరం: ముక్కోటి(వైకుంఠ) ఏకాదశి వేడుకలు నియోజకవర్గవ్యాప్తంగా శుక్రవారం కన్నులపండువగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ధనుర్మాసంలో విశిష్టమైన రోజు కావడంతో భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని బాలాజీ చౌక్, లింగంపర్తి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల పరిధిలోని సిరిపురం, యర్రవరం తదితర గ్రామాల్లోనూ ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

తుని రూరల్: ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఉత్తర ద్వార దర్శనాలకు భక్తులు పోటెత్తారు. టి.తిమ్మాపురం శివారు విష్ణుపురంలో కొలువైన మహాలక్ష్మీ సమేత మహావిష్ణువును వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త పోల్నాటి శేషగిరిరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు యనమల కృష్ణుడు, దేవారపు సూర్యచక్రం, పోతల రమణ, గాబు రాజు, సర్పంచులు, ఎంపీటీసీలు స్వామి,అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈసందర్భంగా ప్రదర్శించిన చిన్నారుల కోలాటాన్ని తిలకించి, కళాకారులను అభినందించారు. ఎస్.అన్నవరం, ఎన్.సూరవరం గ్రామాల్లో వేంచేసిన వేంకటేశ్వరస్వామిని వేలాది మంది భక్తులు ఉత్తర ద్వారం నుంచి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తుని: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం ఆలయాలు హరినామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచి స్థానిక పాదబజారు వీధిలో వేంకటేశ్వరస్వామి, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏడు వారాల వెంకటేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉత్తర ద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకున్నారు. విద్యుత్ దీప కాంతులు, వివిధ రకాల పుష్పాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పోలీసులు బందో బస్తు ఏర్పాటు చేశారు.



తాళ్లూరులో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

గండేపల్లి: తాళ్లూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. పండితులు తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్తరముఖంగా ఉంచిన గరుడ వాహనంపై స్వామి వారిని ఉంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత జ్యోతుల చంటిబాబు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.చుట్టు పక్కల గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. మధ్యాహ్నం గరుడవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది. ఆలయ ఈఓ ఉండమట్ల రాజేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్నవరం: రత్నగిరిపై ముక్కోటి ఏకాదశి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణం, అనివేటి మండపం, యంత్రాలయం, ధ్వజస్తంభం, సత్యదేవుడు, అమ్మవారి నమూనా విగ్రహాలు, తూర్పు రాజగోపురం వద్ద చేసిన పుష్పాలంకరణ, విద్యుత్ దీపాలంకరణలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సత్యదేవుడు, అమ్మవారి విగ్రహాల వద్ద ఫొటోలు దిగడానికి భక్తులు ఆసక్తి చూపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రథసేవ లో సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవమూర్తులను అందంగా అలంకరించారు. ఈ ఊరేగింపులో మహిళల కోలాట ప్రదర్శన అలరించింది.

గరుడ వాహనంపై దర్శనమిచ్చిన తంటికొండ వెంకన్న

గోకవరం: తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జామున భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. విశేష సంఖ్యలో భక్తులు గరుడవాహనంపై వేంచేసిన స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అలాగే గుమ్మళ్లదొడ్డిలోని శ్రీరామగిరి కొండపై వేంచేసిన కోదండరామ సహిత రమాసత్యనారాయణస్వామి, వల్మీక వేంకటేశ్వరస్వామి, గోకవరంలో రమాసత్యనారాయణస్వామి ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.



తునిలో పుష్పాలంకరణలో ఏడు వారాల వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

శంఖవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తొండంగి: దావాయిపేట సముద్రతీరంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటికిటలాడింది. తెల్లవారుజామున స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచిలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, ధర్మవరంలో రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాల స్వామి ఆలయాల్లో భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామివార్లను గ్రామంలో ఊరేగించారు.

కిర్లంపూడి: చిల్లంగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక పరిసర గ్రామాల భక్తులు స్వామి వారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.



తంటికొండలో గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



విద్యుత్ కాంతుల నడుమ సత్యదేవుని ధ్వజస్తంభం

ప్రత్తిపాడు: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. పండితులు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటికిటలాడింది.

ఘనంగా కోదండరాముని గిరి ప్రదక్షిణ

రౌతులపూడి: మండలంలోని ములగపూడిలో రామగిరి కొండపై వెలసిన కోదండరాముని గిరి ప్రదక్షిణ శుక్రవారం ఘనంగా జరిగింది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పండితులు స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కాకినాడకు చెందిన భక్తుల సహకారంతో స్వామివారి ఆలయంలో రూ.60 వేల విలువ చేసే వెండి గంటను ఏర్పాటు చేశారు. అనంతరం కొండదిగువన ఆలయం చుట్టూ సుమారు 1.5 కిలో మీటర్ల మేరకు వందలాది మంది భక్తులు బాణసంచా కాల్పులు, మంగళవాయిద్యాల నడుమ గిరి ప్రదక్షిణ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ సీతాకోదండ స్వామిని దర్శించుకుని స్వామివారి పల్లకీని మోశారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.



ములగపూడిలో గిరి ప్రదక్షణ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్, భక్తులు

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

ప్రత్తిపాడు రూరల్: సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న సీఆర్‌ఎంపీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏపీసీఆర్‌పీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎలిపే రాంజీప్రసాద్, ఇ.నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరి స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ అబ్రహంను కలసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా సీఆర్‌ఎంపీలకు వేతనాలు పెంచలేదని, తక్షణమే వేతనాలు పెంచాలని కోరారు. సీఆర్‌ఎంపీలను విద్యాశాఖలోనికి విలీనం చేసి రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. ఏపీసీఆర్‌పీడబ్ల్యూ ఉపాధ్యక్షుడు ఎం.వేణుగోపాల్ పాల్గొన్నారు.



స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీసీఆర్‌పీడబ్ల్యూ నేతలు

రెగ్యులేటర్ పరిశీలన



రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న డీఈ రవికుమార్

కిర్లంపూడి: ముక్కొల్లులోని రెగ్యులేటర్‌ను ఇరిగేషన్ డీఈ ఎ.రవికుమార్ శుక్రవారం పరిశీలించారు. ఇటీవల సంభవించిన వరదలకు ముక్కొల్లు రెగ్యులేటర్ ఇనుప బల్లలు కొట్టుకుపోయాయి. దీంతో ఇసుకమూటలు అడ్డుగా పెట్టి పంటలకు సాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఇనుప బల్లల ఏర్పాటుతో పాటు శిథిల వ్యవస్థకు చేరిన రెగ్యులేటర్ పక్కగోడలు, మదుం కాలువ మరమత్తులకు అంచనాలు వేసి కాపీలను పంపించాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు. ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, సర్పంచ్ జ్యోతుల రాంబాబు, ఐజీ వై. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

ప్రత్తిపాడు: స్థానిక లయన్స్‌క్లబ్ కమ్యూనిటీ హాలు సమీపంలో శుక్రవారం రాత్రి తాటాకిల్లు దగ్ధమైంది. దేవరకొండ దుర్గకు చెందిన తాటాకింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి గృహోపకరణాలు కాలిపోయాయి. స్థానిక అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎంపీ రత్నరాజు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 50 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

ముద్రగడను కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: ప్రత్తిపాడు మండలంలోని టి.రాయవరం, పీజేపురం గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కిర్లంపూడిలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ఎంపీపీ బత్తుల నాగార్జున, ఎంపీటీసీ తట్టవర్తి రామన్నదొర, మాజీ వైస్ సర్పంచ్ కొండి వెంకటరమణ, పాలేటి శ్రీను, కందుకూరి నూకరాజు తదితరులు ముద్రగడ గిరిబాబును కలిసి మద్దతు తెలిపారు. ప్రత్తిపాడు మండల ఫాస్టర్స్ ఫెలోషిప్, స్టీరింగ్ కమిటీ సభ్యులు, జిల్లా నాయకులు పద్మనాభం, గిరిబాబులను మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రత్తిపాడు: ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏలేశ్వరానికి చెందిన స్పార్క్ సంస్థ రూపొందించిన సైబర్ ప్రో లాక్ రూరల్ ఇన్నోవేషన్ ప్రాజెక్టును ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పార్క్ సంస్థ అధ్యక్షుడు సాయి సందీప్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామ స్థాయి నుంచి సైబర్ నేరాలను అరికట్టే అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో స్పార్క్ సంస్థ ప్రతినిధులు ప్రదీప్, డాక్టర్ విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

రౌతులపూడి: ఎవరైనా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే ఆర్‌టీఏ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని కత్తిపూడి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ హెచ్చరించారు. రౌతులపూడిలో శుక్రవారం ఆయన వాహన తనిఖీ చేపట్టారు. లైసెన్స్ లేని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసిన వారు, హెల్మెట్ ధరించని పది మంది వాహనదారులపై కేసులు నమోదు చేసి వారికి రూ.62,500 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఆర్‌టీఏ చట్టాన్ని అతిక్రమించి ఎవరైన వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు

- ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు
- పాఠశాలల్లో పండగ సందడి

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో శుక్రవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు కన్నులపండవగా జరిగాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు భోగి మంట వేశారు. సంప్రదాయ వంటకాలు, గొబ్బెమ్మలు, రంగవల్లికలు, హరిదాసు తదితర ప్రదర్శనలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ భాను మూర్తి, అకడమిక్ ఇంచార్జి శ్రీలక్ష్మి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి, ఇ.గోకవరం గ్రామాల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెట్టిన రంగవల్లులు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విజేతలకు ఏపీఎం వెంకట్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఎంటీఎల్ నికేష్ వర్మ, మాస్టర్ ట్రైనర్లు రామరాజు, చిన్నబాబు, యూనిట్ ఇన్‌చార్జ్ కొప్పన రాజా, బెన్నోజు నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శంఖవరం: మండలంలోని కత్తిపూడి సీతారామా కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు ఆట, పాటలతో ఉల్లాసంగా గడిపారు. భోగి మంట వెలిగించి దాటి చుట్టూ నృత్యాలు చేశారు. ప్రిన్సిపాల్ సీహెచ్ వీరబాబు సంక్రాంతి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మెగిలి అక్కారావు, నెల్లిపూడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తుని శ్రీప్రకాష్‌లో సంక్రాంతి సంబరాలు

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

జగ్గంపేట: మండల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు భోగి మంటలు వేసి సందడి చేశారు. హరిదాసు, గంగిరెద్దులు, రంగవల్లులు, గొబ్బెమ్మలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జగ్గంపేటలోని వివేకానంద పబ్లిక్ స్కూల్‌లో వేడుకలకు వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు ఒమ్మి రఘురాం, సాహితి పబ్లిక్ స్కూల్‌లో వేడుకలకు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ, జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకలకు ప్రిన్సిపాల్ డి.చిన్నారావు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వేడుకలకు ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

గోకవరం: స్థానిక వెలమపేటలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. చిన్నారులకు బోగిపళ్లు వేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జి.ప్రమీలాదేవి, హెల్పర్ ఎం.అరుణకుమారి, సెంటర్ పరిధిలోని తల్లులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.



గోకవరం అంగన్‌వాడీ సెంటర్‌లో సంక్రాంతి సంబరాలు



జగ్గంపేటలో భోగిమంట వేస్తున్న విద్యార్థులు



కత్తిపూడిలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

ప్రభుత్వ వైఫల్యంతోనే తొక్కిసలాట



ఒమ్మి రఘురాం

జగ్గంపేట: కూటమి ప్రభుత్వ వైఫల్యం కారణంగానే తిరుమల తిరుపతి దేవస్థానంలో తొక్కిసలాట జరిగిందని వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు ఒమ్మి రఘురాం అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తిరుపతి తొక్కిసలాట ఘటనలో ఆరుగురు భక్తులు మృతి చెందడం బాధాకరమన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ టీటీడీ పాలక మండలిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టికెట్ కౌంటర్ వద్ద కనీస వసతులు కల్పించకపోవడం, పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు పబ్లిసిటీ కోసం పడే ఆరాటం అనేక అనర్థాలకు దారి తీస్తోందని విమర్శించారు. పబ్లిసిటీ కోసమే తిరుపతి లడ్డూపై రాజకీయం చేశారని, దీని ఫలితం ఆయనకు తగలక మానదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ తప్పు జరిగినా చంద్రబాబు, కూటమి నేతలు ఆ తప్పును వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మీదకు తోసేయడం పరిపాటిగా మారిందని దుయ్యబట్టారు. తిరుపతి తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.